
దర్శి: ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి, ముస్లింలు


దర్శి: బూచేపల్లిని సత్కరిస్తున్న ముస్లింలు


వై.పాలెంలో ముస్లింలను ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


తాళ్లూరులో: ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి, ముస్లింలు

ఘనంగా రంజాన్ వేడుకలు

● ఈద్గాకు బూచేపల్లి రూ.5 లక్షల విరాళం

దర్శి: పట్టణంలో రంజాన్ పండగ సోమవారం ఘనంగా నిర్వహించారు. కురిచేడు రోడ్డులోని ఈద్గా మైదానంలో ఏర్పాటు చేసిన నమాజు కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బూచేపల్లిని మత పెద్దలు దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఇమామ్‌లతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరికీ మిఠాయిలు పంచి పెట్టారు. బూచేపల్లి ఈద్గాకు రావడంతో పండగ వాతావరణం నెలకొంది. ముస్లింలు బూచేపల్లిని ఆప్యాయంగా కౌగిలించుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అందరితో పాటు లైన్‌లో కూర్చుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి హయాం నుంచి దర్శి నియోజకవర్గంలో తమ ట్రస్ట్ బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ముస్లింల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. రంజాన్ సందర్భంగా తమ ట్రస్ట్ నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈద్గా అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి నిధులు కేటాయిస్తామని చెప్పారు. పార్టీలో ముస్లింలకు మంచి ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ముస్లింలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. కబరిస్తాన్ ఏర్పాటుకు తమ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కురిచేడు రోడ్డులో మసీదు నిర్మాణానికి తాము కూడా సాయం చేశామని, పనులు వేగవంతంగా జరుగుతుండటం సంతోషంగా ఉందన్నారు. అల్లా దయతో అందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని బూచేపల్లి ఆకాంక్షించారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా, దొనకొండ మాజీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, మజ్జువలి, రహమాన్, నాగూరువలి, ఎర్రమేస్త్రీ, ఖాశీ, రహంతుల్లా పాల్గొన్నారు.

తాళ్లూరు: ముస్లింలు రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని తూర్పు గంగవరంలో ఉన్న పాత మసీద్ (మర్కస్) నుంచి దర్శి రోడ్లో ఉన్న ఈద్గా వరకు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. అనంతరం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నమాజ్‌లో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ఈద్గా వద్దకు వెళ్లి నమాజ్ పూర్తయిన తర్వాత ముస్లింలతో కలిశారు. వారిని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని వివిధ మసీదుల్లో ఉన్న మౌలానాలకు దుస్తులు పంపిణీ చేశారు. అక్కడికి చేరిన పేదలకు డబ్బులు దానం చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, కార్యదర్శి కె.ఓబులరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత సూరె రమేష్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, టి.సత్యనారాయణరెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డి, వివిధ విభాగాల నాయకులు సయ్యద్ జబీవుల్లా, ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, రోషిరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, సూరె శ్రీనివాసులు, చెంగల్ నాగయ్య, కృష్ణ, హరినాయక్, షేక్ కాశిం, షేక్ వలి ఉన్నారు.


వై.పాలెంలో సందేశం ఇస్తున్న మౌలానా హిదాయతుల్లా


ముండ్లమూరు: ప్రార్థనకు హాజరైన చిన్నారులు

ముండ్లమూరు (దర్శి): రంజాన్ పర్వదినాన్ని మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజులు పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు రంజాన్ రోజు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మండలంలోని పులిపాడు, బసవాపురం, ఉల్లగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు, నాయుడుపాలెం, శంకరాపురం, మారెళ్ల, ఉమామహేశ్వరపురం, ఈదర తదితర గ్రామాల్లో నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పేదలకు దానధర్మాలు, అన్నదాన కార్యక్రమాలు చేశారు. ఈద్ ముబారక్ అంటూ ప్రతి ఒక్కరూ ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు.

పెద్దదోర్నాల: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. రంజాన్ మాసంలో నెల రోజుల పాటు క్రమం తప్పకుండా ఉపవాస దీక్షలను ఆచరించటంతో పాటు ఐదు పూటలా నమాజ్, రాత్రి వేళల్లో తరావీహ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు సోమవారం రంజాన్ పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఇబ్రహీం మౌలానా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. రంజాన్ పర్వదిన విశిష్టతను ప్రబోధించారు. కొందరు మనుషుల్లోని పిసినారితనాన్ని, ధనార్జన గుణాన్ని రంజాన్ మాసం మార్చేస్తుందని, వారిలో దాన గుణాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ మాసంలో దానధర్మాలు అధికంగా చేయాలని, ఈ నెలలో చేసే ఒక్కో పుణ్యకార్యాన్ని అల్లాహ్ డెబ్బై రెట్లు అధికంగా పుణ్యఫలం ప్రసాదిస్తాడని పేర్కొన్నారు. ప్రార్థనల అనంతరం ఖబరస్తాన్ వద్దకు చేరుకుని తమ కుటుంబ పెద్దల కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రభుత్వం వక్ఫ్ చట్టంపై అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా నల్లబ్యాడ్జిలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు.

పెద్దారవీడు: నెల రోజుల పాటు ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే రంజాన్ పండగ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండలం పరిధిలో పెద్దారవీడు, దేవరాజుగట్టు, సుంకేసుల, గొబ్బూరు, తంగిరాలపల్లి, పుచ్చకాయలపల్లి, తదితర గ్రామాల్లో పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకొని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత గ్రామాల్లో ఉన్న మసీద్‌ల నుంచి ఈద్గాల వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేశారు.

యర్రగొండపాలెం: రంజాన్ పండగను ముస్లింలు వైభవంగా జరుపుకున్నారు. సోమవారం వేకువ జాము నుంచే పట్టణంలో పండగ వాతావరణం కనిపించింది. స్థానిక పెద్ద మసీదు ఆవరణలో ఉన్న ఈద్గా వద్దకు మండలంలోని ముస్లింలు చేరి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మౌలానా హిదాయతుల్లా ఖురాన్ సందేశం ఇచ్చారు. అనంతరం ప్రపంచంలో శాంతి నెలకొనే విధంగా చూడాలని, సకాలంలో వర్షాలు కురిపించి పల్లెలు ఎల్లవేళలు సస్యశ్యామలంగా ఉండే విధంగా చూడాలని, తప్పుదోవ పడుతున్న యువతను సరైన మార్గంలో ఉంచాలని దువా చేశారు.

దొనకొండ: ముస్లింలు రంజాన్ పవిత్ర మాసంలో కఠోర ఉపవాసాలతో ఖురాన్ పఠనం చేస్తూ సోమవారం రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లోని ముస్లింలు ఐక్యంగా కలిసి దొనకొండ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు పవిత్ర రంజాన్ వేడుకల సందర్భంగా నూతన దుస్తులు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దాన, ధర్మాలు చేశారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, సీపీఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, సీపీఐ కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

పుల్లలచెరువు: నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు సోమవారం రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని వందలాది మంది ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత గురువు మాట్లాడుతూ రంజాన్ చాలా పవిత్రమైన రోజు అని, సేవానిరతికి ప్రతీక అయిన రంజాన్ పండుగ నాడు ప్రతి ముస్లిం ఇతరులకు సహాయం చేయాలని, రంజాన్ పవిత్రతను, విశిష్టతను వివరించారు. ప్రవక్త బోధించిన శాంతి సన్మార్గంలో నడవాలని పిలుపు నిచ్చారు. ప్రార్థనల అనంతరం కులమతాల తారతమ్యాలు లేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు ఈద్గా వద్ద చేరి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసిన అనంతరం పర్వదినాన్ని నిర్వహించుకున్నారు. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తప్పకుండా మసీద్‌కు వెళ్లి ప్రార్థనలు చేశారు. అంతేకాకుండా పవిత్ర ఖురాన్ ప్రకారం స్థితిమంతులు ఈ నెలలో పేదలకు దాన ధర్మాలు చేయటం ఆనవాయితీ. ప్రార్థన అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


వై.పాలెంలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి


కురిచేడులో..


దర్శి: నమాజ్‌కు హాజరైన ముస్లింలు


పుల్లలచెరువు: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు


సోమవారం ఒంగోలులో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ దశదిన కర్మలో ఆమె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు

ఈద్గాలో పచ్చనేతల పంచాయితీ

● టెంట్లు తొలగించిన పోలీసులు

యర్రగొండపాలెం: ఈద్గాలో పచ్చనేతలు పంచాయతీ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ఈద్గాకు సమీపంలో ఏర్పాటు చేసుకున్న టెంట్‌లను పోలీసులు తొలగించారు. రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు సోమవారం మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు ఈద్గాకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు ముగిసిన తర్వాత ఎమ్మెల్యేతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఈద్గా వద్దకు వచ్చి నమాజ్ పూర్తి చేసుకొని తిరిగి తమ ఇళ్లకు వెళ్లే ముస్లింలకు వారు శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఈద్గా ప్రాంగణంలో నమాజ్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా ఆయా పార్టీలకు వారు టెంట్‌లు ఏర్పాటు చేసుకుంటారు. రంజాన్ సందర్భంగా ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్, టీడీపీలో ఉన్న ఒక వర్గానికి చెందిన డాక్టర్ మన్నె రవీంద్ర, నియోజకవర్గం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు విడివిడిగా టెంట్లు వేయించుకున్నారు. టీడీపీలో ఉన్న రెండు వర్గాల్లో ఉన్న అంతర్గత కలహాలు ఉండటంతో పక్కపక్కనే ఉన్న టెంట్‌ల పంచాయతీ పోలీసుల వద్దకు చేరింది. తమ టెంట్ ముందు ఉండాలని కూటమి నాయకుడు హుకుం జారీ చేసినట్లు ఉంది. ఆగమేఘాలపై పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి సమీక్షించి ఆ రెండు టెంట్‌లతో సహా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులు వేసుకున్న టెంట్ కూడా పెరికించి వేశారు. నమాజ్ పూర్తయ్యే వరకు ఆయా పార్టీలకు చెందిన నాయకులు ఎండలో మాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన


దర్శి: చేతికి నల్లరిబ్బన్‌లు ధరించి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కురిచేడు: నిరసన తెలుపుతున్న ముస్లింలు


దొనకొండ: నల్ల రిబ్బన్‌లతో నిరసన వ్యక్తం చేస్తున్న దొనకొండ ముస్లింలు

దర్శి: ఇప్పటి వరకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలు నిరసనల మధ్య రంజాన్ పండగ నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సోమవారం రంజాన్ పండగ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భర్త కడియాల లలిత్ సాగర్‌లు హాజరయ్యారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ముస్లింల కోరిక మేరకు చేతికి నల్లబ్యాడ్జి కట్టుకుని ప్రార్థనలకు కూర్చున్నారు. అప్పటికే మైదానంలో అందరూ నల్లబ్యాడ్జిలు ధరించారు. కేంద్రం అమలు పరచబోతున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా అందరూ నల్లబ్యాడ్జిలు ధరించినట్లు మౌలానాలు ఫయాజ్ అహ్మద్, షేక్ జిలానీ, ఖాజీ రహమ్‌తుల్లా, మస్తాన్‌వలి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలు అందరూ వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇరుపార్టీల వారు అధిష్టానం దృష్టికి తీసుకుని వెళ్లి బిల్లు ఆపేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. విజయవాడలో హజ్ యాత్రకు వెళ్లే ఇమ్మిగ్రేషన్ పాయింట్‌ను తీసివేయడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏపీ మొత్తం విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లాలనే ఉద్దేశంతో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌ను కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమ్మిగ్రేషన్ తీసివేయడం దారుణంగా ఉందన్నారు. గన్నవరం ఇమ్మిగ్రేషన్ తీసివేయడంతో హజ్ యాత్రకు వెళ్లే వారు ఇతర రాష్ట్రాలకు వెళ్లి విమానాలు ఎక్కాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచే హజ్ యాత్రకు వెళ్లేలా ఇమ్మిగ్రేషన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కురిచేడు: వక్ఫ్ బోర్డుకు సంబంధించిన బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెడుతున్నందున అందుకు వ్యతిరేకంగా ముస్లింలు నిరసన తెలిపారు. పవిత్ర రంజాన్ పండగ రోజు నల్ల రిబ్బన్లు కట్టుకుని మసీదు నుంచి ఈద్గా వరకు ర్యాలీ చేశారు. ఈద్గాలో ఆఫీసా హుస్సేన్ మాట్లాడుతూ ముస్లింలకు వక్ఫ్ బోర్డు 1400 సంవత్సరాల క్రితం ఏర్పడిందని, దాని ద్వారా సంక్రమించిన ఆస్తులు అల్లాకు చెందుతాయని, క్రయవిక్రయాలు చెల్లనేవరని తెలిపారు. ముస్లింల అభివృద్ధికి వాటిని లీజుకు ఇచ్చి వాటిపై వచ్చే ఆదాయంతో మాత్రమే అభివృద్ధి కార్యక్రమాలు జరుపుకోవాలని ముస్లింలకు వివరించారు. అందరూ ఏకతాటిపై నిలబడి బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

దొనకొండ: ముస్లింల హక్కులను కాలరాసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు సోమవారం నిరసన చేపట్టారు. నల్ల రిబ్బన్లు ధరించి ముస్లింలు ఐక్యంగా నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లింల హక్కులను కాలరాసే విధంగా విలువైన ఆస్తులను కాజేయాలనే దురుద్దేశంతో బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా ఈ బిల్లును తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తోందని, ఈ చర్యలు ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. నిరసన చేసిన వారిలో షేక్ మగ్బుల్ అహ్మద్, మహ్మద్ ఇబ్రహీం, కబీర్, మౌలాలీ, లతీఫ్ సేట్, హుస్సేన్, ఉమ్మర్‌వలి, షేక్ కలీం, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కురిచేడు: మండలంలోని పడమర గంగవరం వెళ్తూ ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. పడమర గంగవరం గ్రామానికి చెందిన దాసరి వెలుగొండయ్య మరొక వ్యక్తితో కలిసి తన ద్విచక్ర వాహనంపై కురిచేడు వచ్చి పనులు ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడిపోయారు. ఈ ఘటనలో దాసరి వెలుగొండయ్య ముఖానికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరొక వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. 108కి సమాచారం అందించడంతో సిబ్బంది వెంకటప్పయ్య, యోహానులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండ తరలించారు.


క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

పగడాల మృతిపై పాస్టర్ల ర్యాలీ


పోలీసుస్టేషన్లో కానిస్టేబుల్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

కురిచేడు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలున్నాయని, సమగ్ర విచారణ చేసి వాస్తవాలు వెలికి తీయాలని మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేశారు. పాస్టర్లు రెవ ఫాదర్ ఎస్.రాయన్న, శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల సేవా కార్యక్రమాల కోసం ఒక సొసైటీని ఏర్పాటు చేసి వారికి అండగా నిలిచిన ప్రవీణ్‌కుమార్ మరణం బాధాకరమన్నారు. ఆయన మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, ఆయన మరణానికి కారణాలను పూర్తిగా విచారణ చేసి వాస్తవాలను వెలికి తీసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కంభంపాటి సామేలు, మంచా తిమోతి, షేక్ కాశీం, జె. రవికుమార్, జి. నిమ్మేష్, పల్లె ప్రభాకర్, వై.హానోకు, పి. గురవయ్య, డి.రాజశేఖర్, కంభంపాటి జోసఫ్, దాసు, మాణిక్యరావు, దోరేపల్లి నవీన్ పాల్గొన్నారు.

పేరు ప్రఖ్యాతలు గడించటం గర్వకారణం

పెద్దదోర్నాల: దీరజ్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించిన సంస్థ వ్యవస్థాపకులు గుమ్మా పద్మజా యల్లేష్‌కు నంది అవార్డు రావటంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ చైర్మన్ శిరీష రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు బాబూమోహన్ చేతుల మీదుగా గుమ్మా పద్మజా యల్లేష్ నంది అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని చిన్నదోర్నాలలో జరిగిన ఓ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ జంకె ఆవులరెడ్డి.. గుమ్మా పద్మజా యల్లేష్‌ను అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. మారుమూల ప్రాంతానికి చెందిన గుమ్మా పద్మజా యల్లేష్ సేవా కార్యక్రమాలతో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించటం అభినందనీయమని ఆవులరెడ్డి కొనియాడారు. జంకె సుబ్బరెడ్డి, ఒంటేరు వెంకటరమణ, మహేష్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.


యల్లేష్‌ను సన్మానిస్తున్న ఆవులరెడ్డి